క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సామర్లకోట 13వ వార్డులో జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక 13వ వార్డులో కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ కావడంతో మహిళా సంఘాల సభ్యులు అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద కృతజ్ఞతా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేతల హరిబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే పేద ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. 31వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఆసరా కార్యక్రమంలోను జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

నేడు పట్టణ పరిధిలో వైఎస్సార్ ఆసరా

సామర్లకోట: పట్టణ పరిధిలోని మహిళా సంఘాల వైఎస్సార్ ఆసరా ఉత్సవం బుధవారం మధ్యాహ్నం పూర్ణా కల్యాణ మండపంలో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా పుష్పయాగం

కొత్తపల్లి: వాకతిప్ప సాలివాస పద్మశాలి రామలయం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారికి శ్రీపుష్పయాగం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఊయలలో ఉంచి అలంకరించారు.

వైభవంగా సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో వేంచేసిన స్వయంభూ శృంగార వల్లభ స్వామి వారి దివ్య కళ్యాణోత్సవాల్లో భాగంగా ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. జిల్లా దేవదాయ అధికారి, ఆలయ ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది మహిళలు పూజలు నిర్వహించారు.

95 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు, గృహసారథులు

సామర్లకోట: కేవలం ఒక్క రోజులోనే మండల, పట్టణ పరిధిలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తి చేశారు. వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత ప్రతి ఇంటికీ ఉదయమే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్న విషయం విదితమే. వరుసగా బ్యాంకుకు నాలుగు రోజుల పాటు సెలవు కావడంతో పింఛన్ల పంపిణీని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు మంగళవారం ప్రారంభించారు.

ఉచిత వైద్య శిబిరంలో 400 మందికి పరీక్షలు



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సామర్లకోట: జి.మేడపాడు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో అనపర్తికి చెందిన రమాదేవి ఆస్పత్రి వైద్యులు ఎం.రమాదేవి, జి.కృష్ణారావు వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళల అన్ని రకాల వ్యాధులకు డాక్టర్ రమాదేవి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే డాక్టర్ జి.కృష్ణారావు ఆధ్వర్యాన స్కానింగ్, రక్త పరీక్షలు, అన్ని రకాల సాధారణ వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పటాని దేవి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మోరంపూడి రమేష్, సొసైటీ అధ్యక్షుడు పాలచర్ల సత్యనారాయణ, తూర్పు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పటాని వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు పుట్టా బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఊరికి ఉపకారి.. చూపాడు దారి..!

- అభివృద్ధికి వారధిగా నిలిచిన పీపీ రెడ్డి
- పెరిగిన ఊరిపై మమకారం చూపుతున్న పారిశ్రామికవేత్త
- ఏలేరు కాలువపై వంతెన నిర్మాణం



ఇప్పటి వరకు స్థానికులకు ప్రాణసంకటంగా మారిన ఏలేరు కాలువ



ఏలేరు కాలువపై పూర్తయిన వంతెన నిర్మాణం

పిఠాపురం: పుట్టిన ఊరినే పట్టించుకోని నేతలున్న ఈ కాలంలో పెరిగిన ఊరిపై మమకారం చూపుతున్నారు ఆ పారిశ్రామికవేత్త. అది ఒకప్పుడు పల్లె.. ఇప్పుడు పట్నంగా మారిపోయింది. అక్కడ ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు ఏ గ్రామంలోనూ ఉండవు. కానీ వారిని ఒక పెద్ద సమస్య పట్టి పీడిస్తోంది. ఇటువైపు ఊరు.. అటువైపు పొలాలు.. మధ్యలో వాగు దాటితేనే కానీ పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి ఆ గ్రామస్తులది. ఎవరు చనిపోయినా అంతిమ సంస్కారాలు చేయాలంటే వాగు దాటాల్సిందే. వాగు దాటడానికి కాలువ మధ్యలో చిన్న గట్టు. మామూలు సమయాల్లో నీటి ప్రవాహం అంతగా ఉండకపోవడంతో చిన్నపాటి ఇబ్బందితో ఎలాగోలా దాటేస్తుంటారు రైతులు. కానీ చిన్నపాటి వర్షం వచ్చినా, వరదలు వచ్చినా వాగు పొంగుతుంది. ఇక దాటడం ప్రాణాలతో చెలగాటమే వారికి. అలాగని దాటకపోతే పొలాలకు వెళ్లలేరు. వెళ్లకపోతే వ్యవసాయం సాగదు. ఇదీ కొన్నేళ్లుగా ఆ గ్రామానికి ఉన్న పెద్ద సమస్య. ఆ గ్రామంలో సమస్య అంటే అది తనదిగా భావిస్తారు ఆయన. సమస్య ఎంత పెద్దదైనా చిటికలో తీర్చడమే ఆయన ధ్యేయం. ఇప్పటికే ఆ గ్రామాన్ని స్మార్ట్ సిటీగా మార్చేసిన ఆయన.. ఈ పెద్ద సమస్యకు పరిష్కారం చూపించేసి నిజంగా ఆ గ్రామానికి దత్త పుత్రుడు అనిపించుకుంటున్నారు. ఆయన ఎవరో కాదు. హైదరాబాద్‌కు చెందిన మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధినేత పీపీ రెడ్డి. ఆ గ్రామంలో చిన్నప్పుడు సరదాగా తిరిగిన జ్ఞాపకాలను ఇప్పటికీ గుర్తు పెట్టుకుని, తనకు ఆ గ్రామం ఏం చేసిందనే దాని కంటే ఆ గ్రామానికి తానేం చేశాననే దృక్పథంతోనే సేవ చేస్తున్నారు. కృష్ణా జిల్లా దొంగిపర్రి గ్రామానికి చెందిన ఆయన చిన్నతనంలో పిఠాపురం మండలం జములపల్లిలో అమ్మమ్మ గారి ఇంటి వద్ద పెరిగారు. అనతి కాలంలోనే పారిశ్రామికవేత్తగా ఎదిగిన ఆయన.. పెరిగిన ఊరిపై మమకారంతో ఏటా సంక్రాంతికి ముందు గ్రామస్తులందరికీ ఆనవాయితీగా నూతన వస్త్రాలు బహూకరించేవారు. కొన్నేళ్లుగా ఇలా సంప్రదాయాన్ని కొనసాగించిన పీపీ రెడ్డి ఆ గ్రామాన్నే దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సంకల్పించారు.

ఏళ్ల సమస్యకు ఆరు నెలల్లో పరిష్కారం

ఆ గ్రామంలో అంతిమ సంస్కారాలు చేయడమంటే ఒక పెద్ద యుద్ధం చేసినట్టే. ఎవరు చనిపోయినా.. వారి అంతిమ సంస్కారాలకు ఏలేరు కాలువ దాటి అవతలకు వెళ్లి చేయాల్సిందే. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు వారి బాధ వర్ణనాతీతం. మృతదేహాన్ని తరలించే అవకాశం లేక రోజుల తరబడి అంత్యక్రియలు చేయలేని దుస్థితి వారిది. తప్పనిసరి పరిస్థితుల్లో వాగులో ఈదుకుంటు మృతదేహాన్ని తీసుకువెళ్లి అంత్యక్రియలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలాంటి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు విన్నవించుకోవడంతో పీపీ రెడ్డి వెంటనే స్పందించారు. రూ.కోటికి పైగా సొంత నిధులు వెచ్చించి వంతెన నిర్మాణం చేపట్టారు. సుమారు ఆరు నెలల వ్యవధిలో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆయన ఔదార్యంపై ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇది మా గ్రామస్తుల అదృష్టం

ఆయన మా గ్రామంలో పెరగడం మా గ్రామస్తులు చేసుకున్న అదృష్టం. ఆయన కృషి చెప్పలేనిది. మా గ్రామానికి ఎంతో చేశారు. మౌలిక వసతులు కల్పించారు. ఆయన దయతో స్వచ్ఛమైన గాలి, నీటిని పరిసరాలను ఆస్వాదిస్తున్నాం. గ్రామ సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తించడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

– పెద్దింటి రజని, సర్పంచ్, జములపల్లి

ఆయన కృషి వెల కట్టలేనిది

లాభం ఉంటేనే కానీపైసా ఖర్చు పెట్టని ఈ రోజుల్లో ఆయన మా గ్రామానికి రూ.కోట్లు ఖర్చు చేయడం ఎంతో అభినందనీయం. ఆయన కృషి వెల కట్టలేనిది. పారిశ్రామికవేత్తలు గ్రామాలను ఇలా దత్తత తీసుకుంటే అన్ని గ్రామాలూ ఇలానే అభివృద్ధి చెందుతాయి. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న సమస్యకు ఆయన పరిష్కారం చూపించారు.

– మందా నాగిరెడ్డి, జములపల్లి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కుతుకుడుమిల్లిలో సచివాలయ కన్వీనర్లకు కిట్లు అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులంతా వలంటీర్లను కలుపుకుని చిత్తశుద్ధితో పనిచేయాలని వైఎస్సార్ సీపీ సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ సూచించారు. మండలంలోని కొండెవరం, పొన్నాడ, మూలపేట, కుతకుడుమిల్లిలో మంగళవారం పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లకు కిట్లు అందించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి గ్రామస్థాయిలోని వలంటీర్లతో కలిసి సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు కష్టపడి పనిచేయాలన్నారు. అలా పనిచేయడానికి ఆసక్తి లేని వారు గ్రామంలో మిగిలిన వారికి అవకాశం కల్పించాలన్నారు. ఎంపీపీ కారే సుధా, సర్పంచులు కర్రి చిన్నారావు, కంబాల మౌనిక, ఎంపీటీసీలు అడ్డా పాప, రాయుడు విష్ణమూర్తి, ఉప సర్పంచ్ మేడిశెట్టి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

- పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలి
- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు పిలుపు
- రెండు మండలాల కార్యకర్తలతో సమావేశం

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని పార్టీ పెద్దాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సామర్లకోట, పెద్దాపురం మండలాల పరిధిలోని కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా పని చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలోని వలంటీర్లు, గృహసారథులు కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి, సమస్యలు అడిగి తెలుసుకొని, పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకూ పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. స్థానికునిగా 35 ఏళ్ల తరువాత నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఇచ్చారని, ఆయనకు ఎప్పుడూ విధేయుడిగా ఉంటానని దొరబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీలు ములసా శ్రీను, పేర్నిడి వెంకట్రాయుడు, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గరవసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కంటే వీరరాఘవరావు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్ చౌదరి, సొసైటీ అధ్యక్షులు తాటికొండ అచ్చిరాజు, వీరంరెడ్డి నాని, ఉటా వాసు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటలో అగ్ని ప్రమాదం

- ఎగసిపడిన మంటలు, పొగ
- ఆందోళనకు గురైన స్థానికులు





అంటుకున్న డబ్బాల నుంచి ఎగసి పడుతున్న దట్టమైన పొగలు. డబ్బాలను పరిశీలిస్తున్న పోలీసులు

పిఠాపురం: వాడేసిన డబ్బాలను శుభ్రం చేసే ప్రక్రియలో అపశ్రుతి చోటు చేసుకుని, అగ్నిప్రమాదానికి దారి తీసింది. పిఠాపురం మండలం వెల్దుర్తిలో మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన పాత ఇనుప సామాన్ల వ్యాపారం చేసే పోకల సత్యనారాయణ కాకినాడకు చెందిన గౌస్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ నుంచి వాడేసిన పాత ఇనుప పీపాలు కొనుగోలు చేశాడు. వాటిని పిఠాపురం మండలం వెల్దుర్తిలో ఉన్న పామాయిల్ తోటలో నిల్వ చేశాడు. ఎప్పటిలానే తాను కొన్న డబ్బాలు అమ్ముకోడానికి వీలుగా వాటిల్లో ఉన్న మడ్డిని బయటకు తీసేందుకు ప్రయత్నించాడు. ఎంతకూ అది బయటకు రాకపోవడంతో చెత్త వేసి, ఆ డబ్బాలకు నిప్పు పెట్టాడు. కాలిన తరువాత డబ్బాల్లో ఉన్న చెత్త ఊడిపోయాక ఖాళీ డబ్బాలను విక్రయించుకోవచ్చని భావించాడు. అయితే డబ్బాల్లో చెత్త వేసి నిప్పు పెట్టగానే మంటలు ఒక్కసారిగా పెరిగి అక్కడ ఉన్న మిగిలిన డబ్బాలకు వ్యాపించాయి. దీంతో ఆ ప్రాంతంలో మంటలతో పాటు దట్టమైన పొగలు అలముకున్నాయి. ఎంత ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాకపోగా దట్టమైన నల్లటి పొగలు రావడంతో చుట్టపక్కల గ్రామాల్లోని జనం ఆందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంపై స్థానికులు పిఠాపురం అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పిఠాపురం తహసీల్దార్ త్రినాథ్, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, సీఐ అబ్దుల్ నబీ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రమాదం వల్ల ఎవరికీ ఎటువంటి నష్టమూ లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా మాండవ్య నారాయణుని గ్రామోత్సవం



సామర్లకోటలో సాగుతున్న మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్యనారాయణ స్వామి వారి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కాలిబాట వంతెన, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, రథం సెంటర్, గాంధీ చౌక్, పెద్ద వీధి, చిన్న వీధి, యార్లగడ్డవారి వీధి, నీలమ్మ చెరువు, దేవీచౌక్ మీదుగా గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. బుధవారం ప్రత్యేక పూజలు, ధ్వజావరోహణ, పూర్ణాహుతి ఉంటాయని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి చెప్పారు. గురువారం ఉదయం పూజలు, రాత్రి శ్రీపుష్పయాగోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

మంచినీటిపై వాగ్వాదం

గరంగరంగా గొల్లప్రోలు మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ

పిఠాపురం: మంచినీటి సరఫరా విషయంలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో గొల్లప్రోలు మండల సమావేశం గరంగరంగా సాగింది. ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. ఇందులో కుళాయిలు వేశారు కానీ మంచినీరు రావడం లేదని వన్నెపూడి ఎంపీటీసీ కందా బాబ్జి ఆరోపించారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతు వెంకటరమణ సమాధానమిస్తూ జల్ జీవన్ మిషన్‌లో కుళాయిలే వేశామని, ఇక నుంచి మంచి నీటి సరఫరా విషయాన్ని పంచాయతీయే చూసుకోవాలని తెలిపారు. దీనిపై స్పందించిన వన్నెపూడి సర్పంచ్ కందా సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ, జల్‌జీవన్ మిషన్‌లో కొత్తగా కుళాయిలు వేయడం వల్ల మొత్తం 80 అయ్యాయని, వాటికి నీరందించడానికి రోజుకు నాలుగుసార్లు ట్యాంకు నింపాల్సి వస్తోందని తెలిపారు. ఎక్కడ నీరందడం లేదో చెబితే పరిశీలించి, నీరు వచ్చేలా చూస్తామని చెప్పారు. దీంతో మోటార్లు ఆపేస్తున్నారని, అందువల్ల నీరు రావడం లేదని చెప్పగా సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడి మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. దీంతో సమావేశంలో కొంత గందరగోళం నెలకొనగా ఎంపీడీఓ శర్మ కలుగజేసుకుని ఇద్దరికీ నచ్చజెప్పారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మత్స్యశాఖాధికారి రామకృష్ణ చేపల అమ్మకాల్లో సబ్సిడీ గురించి వివరిస్తుండగా.. ప్రత్యేక ఆహ్వానితుడు అరిగెల రామయ్య దొర, ఏకే మల్లవరం ఉప సర్పంచ్ సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ, మూడు నెలలుగా తమ గ్రామ పరిధిలో రొయ్యల చెరువుల తవ్వకం గురించి ఫిర్యాదు చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై రామకృష్ణ మాట్లాడుతూ, తాను ఇన్‌చార్జినని చెప్పగా, ఎంపీడీఓ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి అయినా బాధ్యత ఉంటుందని అన్నారు. దీంతో తహసీల్దార్ వెంకటేశ్వరరావు జోక్యం చేసుకుని, ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, దీనిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు నేమాని ఆదివిష్ణు, బత్తిన మంగ తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ సీతారామారావు

పెద్దాపురం: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, దీనిపై ప్రతి ఒక్కరికీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆర్‌డీఓ జె.సీతారామారావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.సరిత అన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై ఏరియా ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు ఎస్.సుదీప్తి అధ్యక్షతన మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ, బాలికలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కొత్తగా స్కాన్ సెంటర్లు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి అనుమతి పొందాలని చెప్పారు. స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ సమాచారాన్ని చట్ట ప్రకారం బహిర్గతం చేయకూడదని, దీనిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆడ శిశువు అని తెలియగానే చాలామంది గర్భస్రావం చేయించుకోవడానికి సిద్ధపడుతున్నారని, దీనిని అరికట్టేందుకే ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనంతరం కిశోర బాలికలకు గర్భ నిర్ధారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ రవికుమార్, కందుల వెంకటాచలం, వైద్యులు సత్యవాణి, మౌనిక, ఎన్‌జీఓ పల్లా వాసవి తదితరులు పాల్గొన్నారు.

ఆవులు.. కేరాఫ్ రోడ్లు

- రోడ్ల పైకి వదిలేస్తున్న యజమానులు
- వాహనచోదకులకు ఇక్కట్లు
- అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్



సామర్లకోట మంతం సెంటర్‌లో బైఠాయించిన ఆవులు

సామర్లకోట: భూమిపై నడయాడే దేవతా స్వరూపంగా ఆవులను హిందువులు భావిస్తారు. గోమాతను చూడగానే పవిత్ర భావనకు గురవుతారు. అటువంటి ఆవులను, దూడలను, ఎద్దుల ఆలనా పాలనను వాటి యజమానులు గాలికొదిలేస్తున్నారు. నిర్లక్ష్యంగా రోడ్ల పైకి వదిలేస్తున్నారు. దీంతో వాహన చోదకులు ఇక్కట్లు పడుతున్నారు. సామర్లకోట పట్టణంలో ఇటీవల ఆవులు, దూడలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ముఖ్యంగా స్టేషన్ సెంటర్, మతం సెంటర్, కూరగాయల మార్కెట్ సెంటర్, మెహర్ కాంప్లెక్స్, బ్రౌన్‌పేట సెంటర్లలో ఎక్కువగా రోడ్లపై బైఠాయిస్తున్నాయి. తగినంత మేత, దాణా పెట్టి సాకాల్సిన యజమానులు వాటి గురించి పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అవి రోడ్లపై ఉన్న చెత్త కాగితాలు, ఆకులు, ప్లాస్టిక్ కవర్లు తింటూ జీవిస్తున్నాయి. రాత్రి వేళల్లో షాపులు మూసిన తరువాత చినుకులు పడితే ఆవులు ఆయా షాపుల వద్దకు చేరుతున్నాయి. పచ్చగడ్డికి బదులు నానా గడ్డీ తింటూ, రాత్రి వేళల్లో ఆయా షాపుల వద్దనే పేడ వేస్తున్నాయి. దీంతో ఆ పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయని షాపుల యజమానులు వాపోతున్నారు. ఆ పేడను శుభ్రం చేసుకోవడానికి వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ఆవుల సంచారానికి సంబంధించి వాటి యజమానులపై పోలీసు, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ, వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆవులు రోడ్డుపై బైఠాయిస్తే, వాటిని బందెలదొడ్డి లోనికి తరలించి, వాటి యజమానులకు జరిమానా విధించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. బందెలదొడ్డిలో పెట్టినా స్పందించని వారి ఆవులను కాకినాడలోని గోశాలలకు తరలించాలని కోరుతున్నారు.

స్పందించకుంటే చర్యలు



రోడ్లపై తిరుగుతున్న ఆవులను యజమానులు వారి ఇళ్ల వద్దనే ఉంచుకోవాల్సిందిగా మైక్‌లో ప్రచారం చేస్తాం. అప్పటికీ స్పందించని వారి ఆవులను కాకినాడలోని గోశాలకు తరలిస్తాం. ఆవుల సంచారంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా వాటి యజమానులు శ్రద్ధ తీసుకోవాలి.

– సీఎంఏ నయీం అహ్మద్, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

తరచుగా ప్రమాదాలు



ట్రాఫిక్ ఎక్కువగా ఉండే రోడ్లపై ఆవులు గుంపులుగుంపులుగా నిద్రించడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనచోదకులు దూరం నుంచి ఆవులను గమనించలేకపోతున్నారు. దగ్గరకు వచ్చిన తరువాత వాటిని గమనించి, వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై అనేకసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదు. కౌన్సిల్ సమావేశంలో చర్చించినా ఫలితం శూన్యం.

– పిట్టా సత్యనారాయణ, కౌన్సిలర్, సామర్లకోట

వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ అధికారులు

సామర్లకోట: రాష్ట్ర పుర పరిపాలన కమిషనర్ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. భూముల రీసర్వే, వివిధ పథకాల అమలు, పన్నుల వసూలు, పారిశుధ్య పనులు, జగనన్న కాలనీలు, ఇతర అభివృద్ధి పనులపై కమిషనర్ సమీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్, టీపీఓ ఫణికుమార్, రెవెన్యూ అధికారి పూడి రవిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

8న రన్ ఫర్ జీసస్

పెద్దాపురం: ఈ నెల 8వ తేదీన రన్ ఫర్ జీసస్ నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్వర్ణ దేవాలయం స్వస్థత శాల వ్యవస్థాపకుడు జీఆర్ ఇమ్మానియేలురాజ్, రన్ ఫర్ జీసస్ కో ఆర్డినేటర్ లంక పురుషోత్తమ్‌దాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధరించే టీ షర్టులు, క్యాప్‌లు, జెండాలను వారు మంగళవారం ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ రన్ ఫర్ జీసస్ ర్యాలీ ఉంటుందన్నారు. దీని ప్రారంభోత్సవంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి పాల్గొంటారని చెప్పారు.